## నిర్మాతలు...నటీనటులు

కవి :
యస్. వి. రాఘవాచార్య

స్క్రీన్ ప్లే :
కే. వి. రెడ్డి
కే. కామేశ్వరరావు

సంగీత దర్శకులు :
చిత్తూరు వి. నాగయ్య
ఓగిరాల రామచంద్రరావు

నృత్య దర్శకుడు :
వేదాంతం రాఘవయ్య

సహాయ దర్శకులు :
కే. కామేశ్వరరావు
సి. నాగేశ్వరరావు

నిర్మాణ కార్యదర్శి :
ఏ. వి. కోటీశ్వరరావు

ఫొటోగ్రఫీ :
మార్కస్ బార్ట్లే

సౌండ్ రికార్డింగ్ :
టి. టి. అరుసు

ఆర్ట్ డైరెక్షన్ :
యఫ్. నాగూర్
యస్. వి. యస్. రామారావు

మేకప్ :
హరిబాయి

ఎడిటింగ్ :
జంబులింగం
ఏ. వి. కోటీశ్వరరావు

లేబొరేటరీ :
హరికృష్ణ & యతిరాజు

స్టూడియో :
న్యూటోన్ స్టూడియోస్

డైరెక్షన్ : కే. వి. రెడ్డి.

| | | |
|---|---|---|
| చిత్తూరు. వి. నాగయ్య —వేమన. | యం. వి. రాజమ్మ —మోహనాంగి. | పార్వతీబాయి —నరసమాంబ |
| యం. లింగమూర్తి —అభిరామయ్య. | బి. కాంతామణి —కోమలాంగి. | బేబీ కృష్ణవేణి —జ్యోతి |
| ఆర్. రామిరెడ్డి —అనవేమారెడ్డి. | ఏ. సీత —కనకాంగి. | కే. దొరస్వామి —అప్పన్న |
| వి. లక్ష్మీకాంతం —కరణం. | రాయప్రోలు సుబ్రహ్మణ్యం —శివయోగి. | సి. నాగేశ్వరరావు —అర్చకుడు |

# యోగి వేమన

వాహిని చిత్రము

## కథాసంగ్రహము

జననమరణముల మర్మమేమిటి ? వాటి నెవరు కల్పిస్తున్నారు ? ఈ జీవిత రహస్యాన్ని తెలుసుకొని లోకానికి చాటించిన పుణ్య పురుషులలో వేమన ఒకడు.

వేమన కాలంనాటికి రెడ్డిరాజ్యం అంతరించి కొండవీడు గజపతుల స్వాధీనంలో ఉంది. వేమన అన్న అనవేమారెడ్డి దుర్గానికి లోబడి మూగచింతపల్లెను పాలిస్తున్నాడు. అనవేమారెడ్డి భార్య నరసమాంబ మహాసాధ్వి. ఆ దంపతు లిరువురికీ భగవంతుడన్నా - మతాచారాలన్నా - ప్రజా విశ్వాసాలన్నా పెద్ద గౌరవం. కాని, వేమనకంతగా వాటిలో నమ్మకంలేదు. తన దారే తనది. తాను నమ్మిందీ-తనకు నచ్చిందీ లోకానికి వెరవకుండా చేస్తాడు. ఆయన హృదయాన్ని ఆకర్షించినవారు, ఇంటిలో అన్నకూతురు జ్యోతి - వీధిలో ఉంపుడుకత్తె మోహనాంగి. ఆ తరవాతివాడు ఆంతరంగిక మిత్రుడు అభిరామయ్య. అభిరామయ్యకు బంగారం చెయ్యాలని పిచ్చి. అయితే గియితే అది మోహనాంగి అవసరాలకు అక్కరకు వస్తుందని వేమన ఆశ. సంసారం జోలి పట్టించుకోకుండా - పెళ్ళీ పేరంటం మాని - సానినే రాణిగా చూసుకుంటూ - విచ్చలవిడిగా విహరించేవాడు వేమన.

ఒకనాడు - వేమన ప్రొద్దుపొడిచేవరకు - రత్నాలహారం చేయించి తెస్తానని మోహనాంగికి మాట యిచ్చాడు. అందుకోసం బయలుదేరి- ఊరిబయట వాగులో స్నానంచేస్తున్న అభిరామయ్యతో శివాలయానికి వెళ్ళి, తిరిగి వస్తుండగా సింహద్వారంలో ఒక పండు ముసలిది చలి

వణుకుతూ కనిపించింది. వేమన మనస్సు కరగిపోయింది. సరాసరి గర్భాలయంలోకి వెళ్ళి, పూజారి తాకవద్దని మొత్తుకుంటున్నా, వినకుండా - అమ్మవారి ఉత్తరీయం తెచ్చి ఆ ముసలిదానికి కప్పాడు. అదేమని అభిరామయ్య మందలిస్తే - జీవి చలికి చస్తుంటే దేవికి లేకపోతే యేమని సమాధానం చెప్పాడు. అభిరామయ్య దగ్గర హారం తీసుకుని మోహనాంగిని దర్శించి-"ఇంతకంటే గొప్పహారం భూలోక భువర్లోకాలలో లే"దని మురిపించి ఆ ఆనందంలో చొక్కుతున్నాడు వేమన.

వేమన దేవాలయంలో చేసిన అత్యాచారం పూజారి శివయ్యవల్ల విని అనవేమారెడ్డి నొచ్చుకొన్నాడు. సంప్రోక్షణ చేయించమని సమాధాన పెట్టి శివయ్యను పంపించాడు. తమ్మునివల్ల సాయంలేకపోగా జట్టీలు వస్తున్నందుకు నరసమాంబవద్ద తన మనోవ్యథ వెళ్లపోశాడు. ఇల్లుచేరి జ్యోతితో ముచ్చట లాడుతున్న వేమనను నరసమాంబ మందలించింది. "రాళ్ళు దేవుళ్ళయితే రాసులు మ్రింగవా వదినా" అని వేమన వాదించాడు. ఆయన వాదం తప్పని నిదర్శనపూర్వకంగా నిరూపించి - ఇప్పటికైనా బాధ్యత లెరిగి అన్నగారికి సహాయుడవు కమ్మని నరసమాంబ బోధించింది.

దేవాలయంలో సంప్రోక్షణ జరుగుతూ ఉంది. దేవదర్శనానికి-నరసమాంబ వచ్చింది. ఆమె మెడలో దేదీప్యమానంగా మెరిసిపోతున్న నాగహారం చూసేవరకు నాట్యంచేస్తున్న మోహనాంగికి కడుపుమండింది. విసవిసా యింటికి వెళ్ళింది.

"ఇంతటి హారం యింట్లో ఉంచుకునే ఇంతకంటే మంచి హారం ఏ లోకంలోనూ లేదని మనను నమ్మించాడు చూశావా" అని తల్లీ-మోహనాంగీ తలలు పట్టుకొన్నారు. ఎలాగైనా దానిని అపహరించాలని పన్నాగంచేశారు. వేమన యింటికి రాగానే ఆ హారం తెచ్చియిస్తేగాని వీలులేదని మోహనాంగి మూడంకెవేసింది. విధిలేక వేమన తెచ్చి యిస్తానన్నాడు.

తీరా యింటికి వచ్చేవరకు జ్యోతికి జ్వరం. ఆమె - నా వద్దనే ఉండు చిన్నాన్నా అని - కదలనివ్వలేదు. మోహనాంగి మనసు తీరక



పోయినా సహించగలడుగాని పసిపాప జ్యోతి మనసు నొచ్చితే భరించలేడు వేమన. ఆమె ప్రక్కనే కూచుని జోలపాడుతూ ఉండిపోయాడు.

మూన్నాళ్ళ తరవాత నాగహారం తీసుకొని వేమన మోహనాంగి యింటికి వెళ్ళాడు. మెళ్ళో పెట్టుకోపోతూండగా అపశకునం. ముసలి ముండ అనుమానపడి, ఎల్లుండి పెట్టుకుందువుగాని లెమ్మని- ఆపింది.

నాగహారం కనిపించక నరసమాంబ వ్యాకులపడి వేమన నడిగింది. నేనే తీసి, మోహనాంగి కిచ్చానని నిస్సంకోచంగా చెప్పాడు. "అది మహాసిద్ధులు మనకిచ్చారే, నా మాంగల్యంతో సమానంగా పూజిస్తున్నానే...దాన్నింత చులకనచేస్తావా, ఏ కీడూ మూడకముందే యిల్లు చేర్చు" అని శాసించింది. వదినమాట కాదనలేక వేమన అభిరామయ్యకా సంగతి చెప్పి యీ ముప్పు తప్పించమన్నాడు. అభిరాముడు మాయ జంగమై వెళ్ళి - నాగహారానికి ఆహుతి చాలడంలేదు-అది మీ యింట్లో వుంటే మీ కుటుంబమే కూలిపోతుందని మోహనాంగి తల్లికి బెదురు పెట్టాడు. నిజమేనని నమ్మి - వచ్చినట్టే ఆ హారం వేమన చేతికిచ్చి పంపించిం దాముసలిది.

ఈ సంగతు లేవీ అనవేమారెడ్డికి తెలియవు. ఆయన అప్పటికే పన్నులు చెల్లించటానికి కొన్ని గడువులు దాటవేసి క్రొత్త గడువు తీసుకున్నాడు. ఆ నాటికి మాట దక్కించి మర్యాద నిలుపుకోవాలని తాపత్రయపడుతున్నాడు. మాటమేరకు రాజప్రతినిధులు పైకంకోసం వచ్చారు. తెల్లవారేవరకు చెల్లిస్తానని మాట యిచ్చాడు. ఇక్కడ అన్నగారిట్లా బాధపడుతుంటే - అక్కడ తమ్ముడుగారు మోహనాంగి నాట్యానికి ముగ్ధుడై కనకాభిషేకం చేయిస్తానని మాటయిచ్చాడు. కనకం యెక్కన్నుంచి తెస్తాడు! ఇంటికివచ్చి, అన్నగారి బొక్కసంలో ఉన్న సంచులు తీసుకువెళ్ళాడు.

తెల్లవారి పన్ను చెల్లించటానికి అన్నగారు మందసం తెరచి చూస్తే సంచులులేవు. నిర్ఘాంతపోయాడు. ఇంటిదొంగే! నిజంచెపితే

ప్రభువులు నమ్ముతారా! పైగా మర్యాదా. మాట మేరకు వారి వెంట బందీగా దుర్గానికి బయలుదేరాడు.

ఇంటికిరాగానే వేమనకు తానుచేసిన తప్పు తెలిసింది. వదినె తనను మందలించకపోగా తన ముఖమైనా చూడలేదు. తన వంశానికీ తన అన్నగారికీ తానుచేసిన మహాపరాధం వేమన కళ్ళకు కట్టింది. "అన్న లేకుండా యీ యింట్లో కాలుపెట్టను వదినా" అంటూ-జ్వరంతో ఉన్న జ్యోతి పిలుస్తున్నా పలక్కుండా-వెళ్ళిపోయాడు. అన్ననెలా వదిలిస్తాడు?

మోహనాంగి యింటికివెళ్ళి రాత్రి తానిచ్చిన సొమ్ము తెమ్మన్నాడు - సాని కిచ్చిన సొమ్ము గోడకుపూసిన సున్నం వస్తుందా అల్లుడా అంది ముసలిది. సాని దాని ప్రేమ తనమీదో తన డబ్బుమీదో తెలిసింది!- వాళ్ల మొహం చూడకుండా - గడపదాటాడు.

ధనమూల మిదం జగత్తని మునుపు విన్నాడేకాని - ఇప్పుడు వేమన తెలుసుకొన్నాడు. అభిరామయ్య యింట్లో - బంగారం సాధించడమో - శరీరం చాలించడమోనని పట్టుబట్టి - నిద్రాహారాలు లేకుండా-పుటాలు వేస్తూ కూచున్నాడు. దివాణంలో జ్యోతి వ్యాధితో దిన క్రమంగా క్షీణించి-మంచంపట్టి-నిద్రాహారాలు లేకుండా "చిన్నాయనా, చిన్నాయనా" అంటూ కలవరిస్తోంది. కాని స్వర్ణయోగంలో, లోకం మరచిన వేమనకా పిలుపు వినిపిస్తుందా? చివరకు-పూర్వ సుకృతాన స్వర్ణం సిద్ధించింది. లోకాన్నే జయించామని బయటికి వచ్చాడు. కాని- జ్యోతికి ప్రమాదంగా ఉందని వార్త. బంగారం పారవేసి యింటికి పరుగెత్తాడు. "నన్ను విడిచి యెక్కడికి వెళ్ళావు చిన్నాయనా - మళ్ళీ నన్ను విడిచిపోతావా చిన్నాయనా" - అంటూ తన చేతుల్లోనే కళ్ళు మూసింది జ్యోతి. వేమన జీవితమే చీకటైపోయింది. తన కళ్ళముందు ఆడుతూ పాడుతూ ఉన్న జ్యోతి ఉన్నట్టుండి మాయమైందే. తానూ అంతేగా! అందరూ అంతేగా! ఏమైపోయింది? ఎక్కడికిపోయింది? తన బంగారమంతా చనిపోయిన ఆ జ్యోతిని తేగలదా?



ఆరిపోతూ ఆ జ్యోతి వేమన హృదయంలో జ్ఞానజ్యోతిని వెలిగించింది. జీవులు ఎందుకు పుడుతున్నారు, ఎందుకు చస్తున్నారు, ఈ జగన్నాటకమంతా యెవ్వరాడిస్తున్నారు? సమాధానం వెదుక్కుంటూ బయలుదేరాడు వేమన. తమ్ముడు సాధించిన బంగారం అన్నగారి విడుదల కోసం దివాణానికప్పగించి స్నేహితుని వెదకుతూ వెళ్లాడభిరామయ్యకూడా. వేమన కాలు తిప్పినట్టల్లా తిరిగి, కనిపించినవన్నీ వెదకి ఏమీ తెలియక చివర కో శివాలయంలో విగ్రహం ముందు నిలబడి నీ సత్యస్వరూపం నాకు చూపించమని ఆర్తుడై వేడుకొన్నాడు. ఈశ్వరుడే సద్గురువై యోగ రహస్యం బోధించాడు. సాధించి సిద్ధుడైనాడు వేమన్న. అభిరామయ్య వెదకి వెదకి మిత్రుని కలుసుకొన్నాడు. అంతటి మహానుభావునికి స్నేహితుడూ శిష్యుడూ కాగలగడం తన పూర్వపుణ్యమని పరవశించాడు.

ఆత్మదర్శనంతో వేమనయోగి సంతృప్తుడు కాలేదు. మహాత్ముల జీవనం వారికోసమే కాదు. లోకోపకారం కోసం. వేమనయోగి కష్టపడి సాధించిన జ్ఞానామృతాన్ని ఊరూరు తిరిగి ప్రజలకు పంచిపెట్టి జీవన పరమార్థం తేటతెల్లముగా వివరించి-జీవకారుణ్యము-సర్వమత సామరస్యమూ-దైవభక్తి కలిగించి-దేశసంచారంలో వృద్ధుడై జీవసమాధికి నిశ్చయించుకొన్నాడు. ఈ వార్త అభిరామయ్యవల్ల తెలుసుకొని-అన వేమారెడ్డి దంపతులు-వృద్ధులై యుండికూడా—ఆ స్థలానికి వచ్చి, అందరితోబాటు ఆ మహానుభావుని కడపటిదర్శనం చేసుకొన్నారు. వేమనయోగి మానవుల మహోదయాన్ని అభిలషించి, ఆశీర్వదిస్తూ కొండ గుహలో ప్రవేశించాడు. ఆయన నిత్యుడు. సారస్వత రూపాన నేటికీ మనకు సేవ్యుడవుతున్నాడు.

ఓం తత్సత్




కనకాంగి- ఏమేమొ చేసేవురా, నేనేమీ నేరని దానరా - సామి ॥ఏ॥
ఇదిగో మాటని పిలచి, కదియ కౌగిట చేర్చి
యీడాడ చెయి వేకు, యిదిగ నుండుర నాకు ॥ఏ॥

మోహనాంగి- తడవాయె నిక లేవరా-
పోపోర సామీ, మరులు నీవిక మానరా
గడచెశేయి - ప్రొద్దు పొడిచే వేళాయెర ॥త॥
కళలూర మనసార - కలసిమెలసి రతుల
సలిపితిమి రేయెల్ల - చాలు పొమ్మంటే
ఏలరా పెనలోభివలె - విడవేలరా బిగికౌగిలిని
వినవేలరా-యీ మోహమిక - చాలనిన నాపై కోపమేలర॥
ఎంత కాలము మనిన - యింతే సౌఖ్యముగాని
అంతున్నదా - సుంత భ్రాంతికేమైన
ఇంతకే ఎనలేని కామము పెంతురా, మచ్చరము లెంతుర
చింతసేయర, తామసించిన యింతబ్రతుకు యింతింతలౌర॥

నరసమాంబ- పాహీ మహేశా - పాప వినాశా
సేవక జన భవ నాశా ॥హే॥
చంద్రమకుట చర్మాంబరధారీ
ఇంద్రనీల గళ హారీ - సేవక జన శుభ కారీ ॥హే॥
అగణిత కరుణా-ఆశ్రిత శరణా, నాగరాజ దివ్యాభరణా
సేవకజన భవ తరణా, నిగమాంత నుతా నిర్మల చరితా
యోగి వినుత-మాంపాలయ శంభో, సేవక జన శుభ కారీ.

మోహనాంగి- ఆపరాని తాపమాయెరా - బాలేందుమౌళీ
ప్రాపుగోరి చేరితిరా - రారా - నన్నేలుకోగా ॥ఆ॥



వలచి వలచి మనసు నీకై - అలసి సొలసి పోయెనురా॥
బాలనురా - వగనాపగ జాలనురా - నీ సేవకురాలనురా
గైకొనరా - వెర నమ్మినార - తమిదీర - దరిజేర|రార॥
ఇందుకళాధరుడవని - సుందర నటరాజువని
ఎందరినో మున్నేలిన - అందాలా సామివని
వింటినిరా - నిన్ను జేర గంటినిరా - జంటకు
రమ్మంటినిరా - ఆర్తి దీర్తువని వింటినిరా
నిన్ను జేర గంటినిరా - జంటకు రమ్మంటినిరా ॥ఆ॥

ముత్తైదులు- వెలదులార - ముదము మీర - నలుగిడరారె
నలుగిడరారె - గౌరీ పరమేశులకు ॥వె॥
వేద శిఖలలో వెలిగే విశ్వవిభులకూ
ఆది దంపతులకూ - శ్రీ పార్వతీమహేశులకు ॥వె॥
జలకేళీ - తేలిచి - తిలకాలూ తీరిచి
పునుగూ జవ్వాది మెదిపి - మేన నలంధీ ॥వె॥
ప్రణయ భువన పాలురైన - ప్రణవమయులకూ
ప్రణుతిజేసి రతనాల హారతీయరె
కర్పూరహారతీయరే, వెలదులార ముదముమీరహారతీయరే॥

వేమన- అందాలు చిందేటి నా జ్యోతీ, ఆనంద మొలికేటి నా|జ్యోతీ :
ఆ కంటిలో జ్యోతి - యీ కంటిలో జ్యోతి
రెండు కన్నులలోన - నిండియున్నది జ్యోతి ॥అందాలు॥
నా మనసులోనుండి - నవ్వించు జ్యోతీ
నా మాటలో నిండి - నడిపించు జ్యోతీ ॥అందాలు॥
తొలికారు మబ్బులో తొంగిచూచే జ్యోతీ
పసిపాప నవ్వులో - పండి విరిసే జ్యోతి. ॥అందాలు॥

వేమన- వదలజాలరా - నా వలపు దీరుపరా నిన్నూ ॥వ॥
మనసార - మరులు దీరా - యీసాకీ - నిలిచిపోరా ॥వ॥

చిరునగ వొలికే - నీ మోము - మరల మరల కననీరా
కళల నెరుగు దొరవౌరా-నిను కలియ కలియగా మనసారా ॥వ॥
మురిపించి - వలపులు కురిపించి - రతులను తేలించీ
కౌగలించు కో నీరా - నా కరువు దీర పరవసింతురా ॥వ॥

వేమన- ఇదేనా - యింతేనా - జీవితసార మిదేనా
అంతులేని - యీ జీవనవైభవ మంతయు
తుదకు నశించుటకేనా - ఇంతేనా.
బోసి నవ్వులను కువ్వలుబోసే, పసిపాపల బ్రతుకు - ఇంతేనా.
ఆటపాటల నలరించుచు - సెలయేటివోలె
వెలివారే బ్రతుకు - యిదేనా.
కిలకిల నవ్వుచు - తొలకరి వలపుల
ఒలకవోయు జవరాలి ఒయారము ఇదేనా.
దాచుకొన్న వయసంతయు, మగనికి
దోచి యిచ్చు యిల్లాలిగతి ఇదేనా.
పురిటిపాప చిరుపెదవుల తాకున
మురిసిపోవు బాలెంత బ్రతుకు ఇదేనా.
తనబలగము - ధన ధాన్యములనుగని,
తనిసే ముదుసలి పేరాశఫలము ఇదేనా.
సకల శాస్త్రములు పార చదివిన, అఖిలదేశముల ఆక్రమించిన
కట్టకడకు - యీ కాయము విడిచి
మట్టి గలసి పోవలెనా మట్టిగలసి పోవలెనా.

వేమన- కనుపించుమురా - మహదేవా
కన్నులార నినుగాంచి తరింతుర ॥క॥
కనుపించెదవని-భువనంబంతయు, కలయవెదకి నిను గననైతినిరా
నీ నెలవేదో - నీ రూపేదో, ఆనతీయరా - జగదేకవిభో ॥క॥



పలుకు పలుకు మని పిలచిన నాతో, పలుక వేమిరా - పరమేశా
పలుకరార-నీ పలుకేవినియెద, కలగిన నా మది-కలతదీరగా ॥క॥

చ్ఛగత్తె- మనసా, మాయనుబడకే మనసా
కాయము కలిమీ - సతమని నమ్మి ॥మా॥
పాయసమ్ముతో - పెంచినగానీ, పాతరలో రక్షించిన గానీ
కాయము కలిమీ - పోయేవేనే
చేసిన పుణ్యమె - చెడని పదార్థము ॥మా॥
మెరమెచ్చులకై చేసిన దానము, పరమునకేమియు-కొరగాదే
కరుణతోడ - నిరుపేదకు వేసిన,
తిరిపెమె యిహ పరసాధనమే॥
ఆశపెంచి యిల్లాలని సుతులని, గాసిని పడకే మనసా
మోసపోకుమీ - వ్యామోహముతో
చేసిన పుణ్యమె - చెడని పదార్థము ॥మా॥

మన- జీవహింస మానండి, జీవుల మీవలె ప్రేమించండి ॥జీ॥
జీవహింసతో బ్రతికేవారు, శివుని మెప్పు గనలేరండీ
జీవులలో శివుడున్నాడండీ, జీవుడె శివుడిని కొలవండీ ॥జీ॥
నేనూ నీవని పొరపడకండీ, మనలో భేదము లేదండీ
అందరిలోపల - ఆరక వెలిగే, ఆత్మఒక్కటే- తెలియండీ ॥జీ॥

ృందగానము- వేదావేతుడు తీమన సుండీ, వేమనబోధలు వినరండీ॥వే॥
మదముల పేరిట-మత్సరాలతో, మానవ హింసలు మానండి
అన్ని మతాలకు అర్థంబొకటే,
అంతా చేరుట - అచటేనండీ ॥వే॥

బహుపుణ్యార్జిత మీ నరజన్మము,
వ్యర్థముచేయుట - తగదండీ
జనన మరణముల - మర్మమెరిగిన,
జన్మమె ధన్యము - తెలియండీ ॥వే॥

Printed at the B, N, K, Press, Q. H. No. MS 100/B,